

# ఫారిన్ వెళ్ళాల(న)ండీ

## – వసుంధర



***మనం ఎంత ఆధునికమైనా, చరిత్రకున్న విలువ మరువలేనిది. అలానే ఈ రోజుల్లో ఎప్పుడు కావాలంటే అప్పుడు ఎక్కడికైనా వెళ్ళగలిగే సౌకర్యాలు (డబ్బులుంటే చాలు) ఉన్నాయి కానీ కొన్ని దశాబ్దాల క్రిందట (1970 దశకం ప్రారంభంలో) ఇలాంటి ప్రయాణాల వెనుకనున్న సాధకబాధకాలు తెలుసుకోవడం ఇప్పటికీ ఆసక్తికరంగా ఉంటుంది. -సం.***

*(గత సంచిక తరువాయి)*

1974–75 వాతావరణంలో అప్పటి పశ్చిమజర్మనీ దేశం ఈ రచనలోని సన్నివేశాలకు వేదిక. ఆ సన్నివేశాలను వివరించినది – అప్పటి వాతావరణంలో సంప్రదాయబద్ధంగా పెరిగి, ఆధునికతని అవగాహన చేసుకుంటున్న ఓ మధ్యతరగతి భారతీయుడు. వృత్తిరీత్యా సైంటిస్టు.

అప్పటికి ఇండియాలో టివిలు కొన్ని మహానగరాలకే పరిమితం. టెలిఫోన్లు వ్యాపారస్థులకీ, భాగ్యవంతులకీ, ఉన్నతోద్యోగులకే అందుబాటు. కంప్యూటర్లది పాశ్చాత్యదేశాల్లోనూ పెద్ద గదిని కేటాయించాల్సినంత పరిమాణం. మొబైల్సు, ఇంటర్నెట్ వగైరాలు వాడుకలోకొస్తాయన్న ఊహ కూడా లేదు.

ఇండియాలో ఇప్పుడు గ్రామాలకున్న సదుపాయాలు, అప్పుడు మహానగరాలకే లేవు. ఆ నేపథ్యాన్ని స్మరించి – రచయితతోపాటు పాఠకులూ 1974లో పయనించి – చదవడం మొదలెడితే – ఈ రచనలోని చాలా విశేషాలు మరింత రసానుభూతినిస్తాయి. ఐతే 2016–17లోనూ – 'మనం ఎక్కణ్ణించి ఎక్కడికొచ్చాం? ఎక్కడికి పోతున్నాం?' అనే భావనను కలిగించి ఆలోచింపజెయ్యగలిగితే, ఈ రచన సార్థకమౌతుంది.

అంశాల పరంగా ఇది రెండు భాగాల రచన. మొదటిది ల్యానబర్గులో 'పీజీ టు కేజీ' గత మాసంలో ముగిసింది. ఇప్పుడు రెండవది 'బెర్లిన్ ద్వీపే డాయిచ్ ఖండే'లో తొలివిడతగా 'ఫన్ నేనొక్కడినే'. ఇందులో అంశాల్ని జరిగిన వరుస క్రమంలో కాక – పాఠకులకు అనువుగా ఉండేందుకు ఉపశీర్షికల్లో వివరించడం జరిగింది.

రసానుభూతితోపాటు, ప్రయోజనాత్మకమూ కావాలన్న మా తపన అక్షరరూపం దాల్చడానికి స్ఫూర్తినిచ్చిన కౌముదికి హృదయపూర్వకంగా ధన్యవాదాలు తెలుపుకుంటూ, రచనలోకి అడుగెడుతున్నాం.

## రెండవ భాగం: బెర్లిన్ ద్వీపే డొయిచ్ ఖండే

## చివరి విడత: మలి సందడి (47)

### ఎక్స్‌టెన్షన్ ప్రహసనం

ఏమైతే అయిందని మళ్లీ రాలెక్‌ని కలుసుకున్నాను. "టెక్నికల్ రిపోర్ట్స్ వ్రాసేటంత జర్మన్ భాషాపరిజ్ఞానం నాకు లేదని డాడ్ ఆఫీసులో తెలుసు. రిపోర్టు ఇంగ్లీషులోనే వ్రాసి పంపుతాను. ఏమౌతుందో చూద్దాం" అన్నాను.

రాలెక్‌కి నా ప్రతిపాదన నచ్చలేదు. "నేను నియమాల్ని ఖచ్చితంగా అనుసరిస్తాను. నానుంచి వెళ్లే నీ రిపోర్టు జర్మన్ భాషలోనే ఉండాలి. కాబట్టి గట్టిగా ప్రయత్నించు" అని పట్టుబట్టాడు.

ఆయనతో అప్పటికేమనలేదు కానీ ఎక్స్‌టన్‌షన్ వదులుకోవాలనే అనుకున్నాను. ఇంటికెళ్లేక శ్రీమతితో అదే మాట చెప్పాను.

"మీరు తలచుకుంటే, జర్మన్లో ఏమిటి– రష్యన్లో రాయమన్నా ఇప్పటికిప్పుడు నేర్చుకుని రాసెయ్యగలరు" అనేసిందామె తేలికగా.

"నీకలా అనిపిస్తోందేమోకానీ– నాకుమాత్రం ఇది కప్ప-ఎద్దు కథలాగుంది" అన్నాను.

కప్ప పిల్లలు మొదటిసారి ఎద్దుని చూసి, ఎంత పెద్దదో అని ఆశ్చర్యపడి ఆ విషయం తల్లి కప్పకి చెప్పాయి. తను ఎద్దు కంటే గొప్ప అని పిల్లలముందు నిరూపించడానికి కప్ప పొట్టని ఉబ్బించి, ఆ ఎద్దు ఇంతుందా అనడిగింది. వాళ్లు ఇంకా పెద్దదంటే– పొట్ట ఇంకాస్త ఉబ్బించింది. ఎంత ఉబ్బిస్తే కప్ప ఎద్దౌతుంది? చివరకు దాని పొట్ట పగిలి చచ్చింది.

స్వశక్తిని సరిగ్గా అంచనా వెయ్యడం విషయంలో– ఈ పంచతంత్ర కథ చిన్నప్పట్నించీ నాకు ఆదర్శం.

శ్రీమతి తల అడ్డంగా ఊపి, "సామ్యం సరిగ్గా లేదు. పట్టించుకోక కానీ ఈ పాటికే మీరు ఇక్కడి భాషలో నిష్ణాతులయుండేవారు. ఇప్పుడు పట్టించుకోండి. నాకిక్కడ ఇంకా మరికొన్నాళ్లు ఉండాలనుంది" అంది.

ఇది శ్రీమతి స్టైల్లో అర్థాంతరన్యాసాలంకారం. ఏదో ఒకటి చేసి ఎక్స్‌టెన్షన్ సాధించాలని ఆమె ఆదేశం.

"రావుగార్ని సాయమడగొచ్చు. కానీ ఆయనకి అంత టైముంటుందా?" అన్నాను. శ్రీమతి తల్చుకోవాలే కానీ, ఆయన్ని టైం ఉండేలా చెయ్యగల చాకచక్యముందని ఓ బాణం వేశాను.

"అన్నింటికీ రావుగారేనా? ఆయన్నిబ్బందిపెట్టొద్దు. మీ ఫ్రెండ్ ఓంప్రకాష్ జర్మన్లో థీసిస్ రాస్తున్నాడుగా– అతగాడికైతే ఇది చాలా సులభం" అంది శ్రీమతి.

ఓంప్రకాష్ సబ్జక్ట్ మెటలర్జీ. పీహెచ్‌డి థీసిస్ స్టేజికి వచ్చింది. అతడు జర్మన్ చక్కగా మాట్లాడతాడు. థీసిస్ వ్రాయడంకోసం ఆ భాషమీద పట్టు సాధించడానికి కృషి చేస్తున్నాడు.

అంతవరకూ నాకతడి పేరు తట్టనందుకు కొంత ఆశ్చర్యం, కొంత చిరాకు. వాటిని పక్కనెట్టి ముందు శ్రీమతిని అభినందించి మర్నాడు ఆఫీసునుంచి ఓంప్రకాష్‌కి ఫోన్ చేసి విషయం చెప్పాను.

అతడు వెంటనే, "నువ్వు ముందు ఇంగ్లీషులో రిపోర్టు వ్రాయి. మనమిద్దరం కలిసి కూర్చుని డిక్షనరీ పక్కన పెట్టుకుని దాన్ని తర్జుమా చేద్దాం. తుదిమెరుగులకి నా జర్మన్ కొలీగ్సు సాయం తీసుకుంటాను. అప్పుడు మీ ప్రొఫెసరుకి చూపించి ఆయన బాగుందంటే– ఆ క్రెడిట్ నాది. లేదూ ఆ పాపం నీది" అన్నాడు.

ఇండియన్ సైంటిస్టుని. ఇలాంటివి రాయడానికి కష్టమేముంటుంది? జర్మనీలో ఏం చెయ్యాలనుకుంటున్నానో ప్రతిపాదిస్తూ డిటెయిల్డ్ ప్రోగ్రాం ఇచ్చేకనే నాకీ స్కాలర్‌షిప్ వచ్చింది. ఆ ప్రోగ్రాంలో ప్రిపరేషన్ పార్ట్ పూర్తయింది. ఇప్పుడు టెస్టింగుకి ప్రిపేరవుతున్నాం. అప్పుడు చేస్తానని వ్రాశను, ఇప్పుడు చేశానని రాయాలి. మిగిలింది పూర్తి చెయ్యడం ఎంత అవసరమో, అందుకు ఎక్స్‌టెన్షన్ ఎందుకు తప్పనిసరో వివరించాలి. అదీ ఇంగ్లీషులో.

ఒక్క పూటలో ఇంగ్లీషు స్క్రిప్టు తయారైంది. మధ్యాహ్నానికి ఓంప్రకాష్ వచ్చి నా రిపోర్ట్ చూసి, "నువ్విక్కడ ఇంత పని చేశావా? నా థీసిస్‌కే ఇంత వర్క్ చెయ్యలేదు...." అన్నాడు మెప్పుకోలుగా.

"జర్మన్ నీళ్లు బాగా వంటబట్టాయిగా– అతిశయోక్తులకి లోటుండదుకానీ– ముందు అనువాదం మొదలెడదాం" అన్నాను.

"అతిశయోక్తి వద్దన్నావు కాబట్టి చెబుతున్నాను. నీ రిపోర్టులో ఓపెనింగ్ సెంటెన్స్ మార్చాలి" అన్నాడు.

జోక్ చేస్తున్నాడనుకుని అతడి మొహంలోకి చూశాను.

చాలా గంభీరంగా ఉంది అతడి మొహం. ఒకసారి పనిలోకి దిగితే అతడి మొహం అలాగే ఉంటుంది.

గతుక్కుమని, మొదటి వాక్యం చదువుకున్నాను.

నేను వాడే హొమోజీనియస్ ప్రెసిపిటేషన్ టెక్నిక్– సాధారణంగా వాడేది ఎనాలిసిస్‌కీ, సెపరేషన్సుకీ. ఇది వాడ్డంవల్ల గంటలు పట్టే పని నిముషాల్లో ఐపోతుంది. నేనీ టెక్నిక్ ప్రస్తావన తేగానే– ఎనాలిసిస్సుకో, సెపరేషన్సుకో అనుకునే ప్రమాదముంటుంది. అందుకని ఈ టెక్నిక్ అందుకు కాదని మొదటి వాక్యం వ్రాశాను.

"మనమేదైనా ప్రపోజ్ చేస్తున్నప్పుడు– నెగెటివ్ స్టేట్మెంట్‌తో మొదలెట్టకూడదు. అలాంటి పాయింట్లు మధ్యలో చెప్పాలి. ఆరంభంలో పాజిటివ్ స్టేట్మెంట్సే ఉండాలి" అన్నాడు ఓంప్రకాష్.

ఇది అతగాడు ఎక్కడైనా విన్నాడేమో తెలియదు. కానీ అంతవరకూ నేను అనుసరించని గొప్ప పాఠం.

ఆ రోజుల్లో ద్విగుణీకృతావధానం చేసిన అరుదైన కవుల్లో ఒకరైన మా తాతగారికి ఉచిత విద్యాదానం హాబీ. తెలుగులో విద్వాన్ పరీక్షకు ప్రిపేరయ్యేవారు తరచుగా మా తాతగారి వద్దకు వస్తుండేవారు. ఆయన చెప్పే పాఠాలు నేటి ప్రవచనాలనిమించి ఆసక్తికరంగా ఉండేవి. అలా నేను పురాణేతిహాసాలు, పలు కావ్యాలలోని సాహితీవిన్యాసాలు,

నిగూడార్థాలు ఎన్నో విన్నాను. ఒకసారి ఆయన రామాయణంలో– హనుమంతుడు లంకకు వెళ్ళి సీతను చూసొచ్చి రాముణ్ణి కలిసిన సందర్భాన్ని ప్రస్తావించారు.

అప్పుడు హనుమంతుడు, "నేను లెక్కలేనన్ని ప్రదేశాలు తిరిగాను. ఎక్కడా సీత కనబడలేదు. తర్వాత లంకకు వెళ్ళి ఊరంతా గాలించాను. కనబడలేదు. రాజాంతఃపురంలో కూడా చూశాను. అక్కడా కనబడలేదు" అని మొదలెట్టొచ్చు. కానీ అలా చెయ్యలేదు. 'చూసితిని, సీతను' అంటూ మొదలెట్టాడు.

ఆ అంతరార్థాన్ని ఆయన అరగంటసేపు వివరించి, "మీ నాన్న నీ పెళ్ళి సంబంధం మాట్లాడ్డానికి వెళ్లేడనుకో. కాబోయే వియ్యంకుడికీ, ఆయనకీ ఒకప్పుడు చాలా గొడవలుండేవనుకో. వెడుతూనే– 'నేనిప్పుడు పాత గొడవలు తవ్వడానికి రాలేదు. కొత్త గొడవలు పెట్టుకుందుకూ రాలేదు. నిన్ను క్షమార్పణ అడగడానికో, నీచేత క్షమార్పణ చెప్పించుకుందుకో రాలేదు' అంటూ చేటభారతం మొదలెట్టకూడదు. 'మీ అమ్మాయి నచ్చింది. పెళ్ళి సంబంధం కలుపుకుందుకొచ్చాను' అనడంలో ఒక స్నేహపూర్వక వాతావరణం ఏర్పడుతుంది' అన్నారు.

అది నాకు బాగా గుర్తుంది కానీ, ఆ సూచనని నా ప్రపోజల్లో పాటించలేదన్న విషయాన్ని ఓంప్రకాష్ చెప్పేదాకా గుర్తించలేదు. గుర్తించేక జీవితాంతం మరువలేదు.

ఓంప్రకాష్ తనతో మంచి టెక్నికల్ డిక్షనరీ తెచ్చాడు. పదాల ఎంపికలో సాయం చేస్తూ మొత్తం అనువాదాన్ని నాచేతే చేయించాడు.

మొదటి పేరా అనువదించడానికి గంటకి పైగా పట్టింది. తర్వాతనుంచి వేగం పెరిగింది. ఆఫీసు టైమైపోయినా మా పని కొనసాగింది.

మధ్యాహ్నం ఇంటికి లంచికి వెళ్లినప్పుడు కూడా, ఆలస్యంగా వస్తానని శ్రీమతికి సూచనప్రాయంగానైనా చెప్పలేదు. కారణం తెలియక కంగారు పడుతుందేమోనని మనసులో బెంగ. నాకైతే మిగతాపని రేపు చూడొచ్చులే అని ఉంది. కానీ ఆ పని తనదే అన్నంత పట్టుదలగా ఉన్నాడు ఓంప్రకాష్.

అయ్యేసరికి రాత్రి ఎనిమిదయింది. ఓంప్రకాష్‌కి థాంక్స్ చెప్పాను.

"నీ థాంక్సు నా మోరల్ సపోర్టుకే! అనువాదమంతా నువ్వే చేశావు!" అన్నాడతడు.

మనసులో నిజమేననిపించినా, "ఔనా! మరి ఓపెనింగ్ సెంటెన్సుతో మొదలెట్టి, ఎన్ని మార్పులు చేశావ్ నువ్వు? ఈ రోజు నీనుంచి జర్మన్లోకి అనువాదమే కాదు, ఇంగ్లీషులో రిపోర్టుకీ ఎన్నో చిట్కాలు తెలిశాయి" అన్నాను.

"ఐతే మా పక్కింటి పిన్నిగారి టెక్నిక్ బాగా పనికొచ్చిందన్నమాట!" అన్నాడు ఓంప్రకాష్.

ఓసారి ఓంప్రకాష్ తల్లికి జ్వరమొచ్చింది. పిన్ని ఊరికెళ్లింది. ఇంట్లో నలుగురు చిన్నపిల్లలున్నారు. వంటింటి పని పిల్లల వల్లకాదు. తండ్రికీ, చిన్నాన్నకూ అలవాటు లేదు కానీ తప్పనిసరై వంట చెయ్యడానికి సిద్ధపడ్డారు. అప్పుడు,

'నేనుండగా పెద్దమగాళ్లని చెయ్యి కాల్చుకోనిస్తానా' అంటూ వచ్చింది పక్కింటి పిన్నిగారు. దాంతో తండ్రీ, చిన్నాన్నా హమ్మయ్య అనుకున్నారు.

పిన్నిగారు పిల్లల్ని సాయానికి పిలిచింది. క్షణాలమీద అందర్నీ ఎంగేజ్ చేసేసింది. గిన్నెలు తొలిచేవారొకరు, కూరలు తరిగేవారొకరు, స్టవ్ మీద వేయించేవారొకరు. ఓ పని అవగానే మరో పని. చేతికి మట్టంటకుండా, ఏ గిన్నేనీ వేలేసైనా ముట్టుకోకుండా– కేవలం అజమాయిషీతో పిల్లలచేత వంట పూర్తి చేయించింది పిన్నిగారు.

"అమ్మ, పిన్ని వంట చేస్తే– మాకేం పనుండేది కాదు. పిన్నిగారు చేస్తే– మాకే పని! ఆ పూట పిన్నిగారు చేసిందల్లా– వంట అద్భుతమని నాన్నా, బాబాయ్ మెచ్చుకున్నప్పుడు– సిగ్గుతో మెలికలు తిరగడం" అని, "అప్పట్నించీ– ఎదుటివాళ్లచేత పని చేయించి క్రెడిట్ మనం కొట్టెయ్యడాన్ని, పిన్నిగారి వంట అంటాం మా ఇంట్లో. నేనిప్పుడు నీ అనువాదంలోనూ అదే టెక్నిక్ వాడాను" అన్నాడు ఓంప్రకాష్.

అప్పుడు నేనతడికి 'తాజ్‌మహల్ నిర్మాణానికి రాళ్లెత్తిన కూలీలెవ్వరు' అన్న శ్రీశ్రీ కవితను అనువదించి చెప్పి, "క్రెడిటెప్పుడూ ఏంచెయ్యాలో, ఎలా చెయ్యాలో తెలిసినవాళ్లకే చెందుతుంది. చెప్పింది చెప్పినట్లు చెయ్యడం మాత్రమే తెలిసినవాళ్లకి కాదు" అంటూ అతడి కంట్రిబ్యూషన్ విలువ ఏమాత్రం తగ్గకుండా జాగ్రత్తపడ్డాను.

మర్నాడా అనువాదాన్ని డెకర్ట్‌కి చూపిస్తే– బాగుందన్నాడు. రాలెక్‌కి చూపిస్తే– బాగోగులు చెప్పలేదు కానీ, సరిచెయ్యడానికి ఉత్సాహం చూపించాడు. ఇద్దరం కలిసి ఓ గంట కూర్చుని స్క్రిప్టు ఫైనలైజ్ చేశాం. తర్వాత దాన్ని రాలెక్ టైపు చెయ్యమన్నాడు.

రాలెక్‌తో సహా అక్కడివాళ్లందరికీ ఎంతోకొంత టైపింగ్ వచ్చు. అది ప్రొఫెషన్లో ఒక భాగంగా భావిస్తారు వాళ్లు. అంతకుముందోసారి నాకు టైపింగ్ రాదని డెకర్టుతో అంటే– 'అదో బ్రహ్మవిద్యా? టైపింగు రావడం, రాకపోవడం ఉండదు. చెయ్యడమే! అలవాటైతే స్పీడుగా చేస్తారు. లేకపోతే కాస్త స్లో అంతే!' అన్నాడతడు.

జీవితంలో నాకదో గొప్ప పాఠం.

టైపింగ్ నా ప్రొఫెషన్లోనూ ఒక భాగమని ఇండియాలో నాకెప్పుడూ తోచలేదు. ప్రతి డిపార్టుమెంటుకీ టైపింగుకని ప్రత్యేకంగా ఓ టైపిస్టు ఉన్నాడు. రెండు పంక్తుల ఉత్తరమైనా సరే, టైపింగుకి అతడే ఆధారం. చేతినిండా పనితో రోజంతా బిజీగా ఉంటాడతడు. టైపింగుకి వచ్చిన కాగితాల్ని ఫైల్లో ఓ వరసలో పెట్టి, లాగ్‌బుక్‌లో నోట్ చేసుకునేవాడు. మన టర్న్ రావడానికి ఒకోసారి మూడు నాలుగు రోజులు ఎదురు చూడాలి.

అలాగని టైపిస్ట్ పదవి పెద్ద హోదా ఏం కాదు. టైపింగ్ రానివాళ్లం రాదన్న విషయాన్ని గొప్పగా చెప్పుకునేవాళ్లం. వచ్చిన ఒకరో ఇద్దరో, అది తామెందుకు నేర్చుకోవాల్సివచ్చిందో సంజాయిషీ ఇచ్చేవారు. ఇంతకీ వాళ్లు కూడా టైపింగులో ఎక్స్‌పర్ట్సు కాదు. వాళ్లు టైపు చేస్తే కొన్ని అక్షరాలు స్పష్టంగానూ, కొన్ని అస్పష్టంగానూ ఉండేవి. అందుకు కారణం వాళ్లు

అన్ని అక్షరాలకీ ఒకే ఫోర్సుతో స్ట్రోక్సు ఇవ్వడం లేదుట. మా టైపిస్ట్ టైప్ చేసిన కాగితాలు చూస్తే అచ్చొత్తిన కాగితం చూసినట్లే ఉంటుంది.

తను టైపిస్టు కావాల్సొచ్చిందని వాపోతుండే మా టైపిస్ట్ కూడా, "టైపింగ్ ఈజే యాన్ ఆర్ట్" అని గర్వంగా అంటాడు.

ఐనా నేను మాత్రం ఆ ఆర్ట్ నాకు రాలేదని గర్వపడేవాణ్ణి.

ఇక్కడ డెకర్ట్ మాటలు విన్నాక, నా దృక్పథానికి కాస్త సిగ్గుపడ్డాను.

డిపార్టుమెంట్లో ఓ ఎలక్ట్రికల్ టైపురైటరుంది. దానిమీద అప్పుడప్పుడు ప్రాక్టీస్ చేస్తే స్పీడ్ రాలేదు కానీ చిన్న చిన్న పన్లు చెయ్యగలనన్న నమ్మకం కుదిరింది. ఇంకో విశేషమేమంటే, ఇక్కడ స్ట్రోక్స్ కంట్రోల్ చేసుకోనక్కర్లేదు. ఎలా కొట్టినాసరే పడిన అక్షరం స్పష్టత ఒక్కలాగే ఉంటుంది. అంటే ఆర్టులో ఓ భాగం తగ్గింది.

రాలెక్ చెప్పగానే ఎలక్ట్రికల్ టైపురైటర్ మీద రిపోర్ట్ టైప్ చేశాను. అక్షరం అక్షరం చూసి కొట్టడం ఒకటి, ఏకాగ్రత ఒకటి– నా రిపోర్టులో ఎక్కడా అచ్చు తప్పు లేదు.

అలా బాన్ లో ఉండే డాడ్ ఆఫీసుకి– నానుంచి ఆర్నెల్ల ఎక్స్‌టెన్షన్ రిక్వెస్ట్ లెటర్ వెళ్లింది.

నా ఉత్తరం ఇలా అందిందో లేదో, అలా వాళ్లు అనుమతినిస్తూ వెంటనే బదులిచ్చారు.

ఇండియాలో నిర్ణయాలు అంత సులభంగా తేలవు. అంతా 'కలవారి కోడలు కలికి కామాక్షి' టైపు.

అన్నలు చెల్లెల్ని పుట్టింటికి తీసుకెళ్లాలంటే ముందు అత్తనడగాలి. ఆమె 'నేనెరుగ నేనెరుగ మీ మామనడుగు' అంటే– అక్కణ్ణించి వరుసగా మామగార్నీ, బావగార్నీ, తోడికోడల్నీ, చివరగా భర్తనీ అడగాలి. ఇంతకీ భర్త నిర్ణయం తెలిసిందే– కానీ అందుకు ముందు– మిగతావాళ్లకి అభ్యంతరం లేదన్న విషయం తేలాలి.

ఇది మన కుటుంబ సంస్కృతి ఔన్నత్యాన్ని తెలియజేస్తుంది.

ఐతే ఇదే కుటుంబ సంస్కృతి అడ్మినిస్ట్రేషన్‌కి కూడా విస్తరిస్తే– నిర్ణయాల జాప్యానికి దారి తీస్తుంది. వలస నేతలు బానిస పౌరుల్ని శాసించడానికి విధించిన నియమాల్ని– స్వతంత్రులమై దశాబ్దాలు గడుస్తున్నా అనుసరించే విచిత్ర సంస్కృతి భరతావనిది. పాలనకు కుటుంబ సంస్కృతిని అనుసరించడానికి పౌరులు అభ్యంతరం చెప్పడం లేదనేమో, పాలకులనిచ్చే పార్టీలకూ పాకుతోందది.

నాకు ఎక్స్‌టెన్షన్ అవసరమని ప్రొఫెసర్ రాలెక్ నిర్ణయించాడు. ఉత్తరం డాడ్ ఆఫీసుకి వెళ్లింది. వాళ్లు వెంటనే సానుకూల నిర్ణయం తీసుకుని నేరుగా నాకు తెలియబర్చారు.

రాలెక్‌కి అది చాలా మామూలు విషయం కావచ్చు కానీ, నేను బాగా ఆశ్చర్యపడ్డాను. తర్వాత అది ఆనందంగా మారితే, ఇంటికెళ్లి శ్రీమతితో పంచుకున్నాను.

ఆమె నన్ను కాసేపు ఆనందపడనిచ్చి, “ఈ విషయం భువనేశ్వర్లో మీ ఆఫీసుకి– వాళ్లు చెబుతారా? మీరు చెప్పాలా?” అంది.

అది ఉత్త కుతూహలం కాదు. ‘అంతం కాదిది ఆరంభమే సుమా’ అన్న స్పృహ నాకు కలిగించడానికి చేసిన ప్రయత్నం.

భువనేశ్వర్లో మా లేబరేటరీలో రెండు అహాల మధ్య యుద్ధం జరుగుతోంది.

ఒక అహం లేబరేటరీ డైరెక్టర్ ప్రఫుల్ల. రెండవది ఆయన తర్వాతి స్థానంలో ఉన్న భరత్.

ఈ అహాలకున్న నేపథ్యం రావణకాష్టం లాంటిది. దాని గురించి వీలైనంత క్లుప్తంగా చెబుతాను.

భరత్ సమర్థుడు, అనుభవజ్ఞుడైన సైంటిస్టు. విదేశాల్లో కొన్నాళ్లుండి, స్వదేశంలో ఓ విదేశీ పారిశ్రామికసంస్థలో రాణిస్తున్న సమయంలో అప్పటి మా లేబరేటరీ డైరెక్టర్ సీతారాం దృష్టికొచ్చాడు. కొత్తగా మొదలైన ఆ సంస్థకు భరత్ సేవలు ఆవశ్యకమని భావించి, ఆయన్ని ఆకర్షించడానికి తగిన వాగ్దానాలు చేసి, భువనేశ్వర్ రప్పించి, తన తర్వాత తనంతటివాడుగా నియమించాడు.

లేబరేటరీ ఒరిస్సాలో ఉంది. సీతారాం ఒరిస్సాకు చెందినా– తెలుగువాడు. స్థానికతకంటే ప్రతిభకు పట్టం కట్టే రాజకీయనేత బిజూ పట్నాయక్ కారణంగా ఆయనకా ఉన్నత పదవి దక్కింది. తర్వాత అక్కడ బిజూ ప్రాభవం తగ్గడంతో స్థానికతకు ప్రాబల్యం పెరిగి సీతారాంకి పదవీ గండం ఏర్పడింది. ఆ సమస్యతో సతమతమౌతున్న ఆయనకు భరత్‌కిచ్చిన వాగ్దానాల్ని పట్టించుకునేందుకు సమయం లేకపోయింది. ఫలితంగా భరత్ ఆయనకు ఎదురుతిరిగాడు. మానసికమైన ఒత్తిడి తట్టుకోలేక సీతారాం, రాజీనామా చేసి వెళ్లిపోతే– భరత్ లేబరేటరీకి తాత్కాలికంగా అధిపతి అయ్యాడు. వచ్చిన అవకాశాన్ని ఉపయోగించుకుని ఆయన తన సత్తాని నిరూపించుకుందుకు రెండున్నర ఏళ్లపాటు అవిరళ కృషి చేశాడు. డైరెక్టర్ పోస్ట్ ఆయన్నే వరిస్తుందని అంతా అనుకుంటున్న సమయంలో– ఉత్తరాది యూనివర్సిటీలో ప్రొఫెసరుగా ఉంటున్న ప్రఫుల్ల డైరెక్టరుగా నియమితుడయ్యాడు.

ఈ విషయమై భరత్ మనోభావాలు పలు విధాలుగా దెబ్బతిన్నాయి.

లేబరేటరీ పారిశ్రామిక పరిశోధనలకి ఉద్దేశించబడింది. దాన్ని నడిపించడానికి– పారిశ్రామికరంగంలో అనుభవమున్న తనని కాదని, యూనివర్సిటీ ప్రొఫెసర్ని నియమించడమేమిటని భరత్ ఆవేదన.

ప్రఫుల్ల ఒరిస్సాకు చెందినవాడు. ఆయన ఎంపికకు అదే కారణమని భరత్ నమ్మకం.

ప్రఫుల్ల భరత్‌కి సమవయస్కుడు. కాబట్టి తనకా లేబరేటరీలో ఎదుగుదలకు అవకాశం లేదని భరత్‌లో నైరాశ్యం.

అప్పట్లో సీయస్ఐఆర్‌లో డైరెక్టరు పదవి ఇంద్రపదవి లాంటిది. బాధ్యతలకంటే అధికారం పెక్కు. అస్మదీయులకు అలవోకగా వరాలు, తస్మదీయులకు అంతే అలవోకగా శాపాలు– ఆ పదవికి సంక్రమించిన హక్కు. ఆపైన వందిమాగధుల స్తోత్రపాఠాలు ఇచ్చే కిక్కు.

ఇవన్నీ భరత్ రెండున్నరేళ్లు అనుభవించి ఉన్నాడు. ఇప్పుడవి ప్రఫుల్ల అనుభవిస్తున్నాడు. ఇదిలాగుంటే– పుండుమీద కారం చల్లినట్లు–భరత్ ముఖ్యానుచరులు అటు వెళ్లిపోయారు. అదో ఉక్రోషం.

నేను సీతారాం రాజీనామాకు ఓ ఏడాది ముందు భరత్ డివిజన్లో చేరాను. తనతో పని చేసేవారిని జూనియర్సులా కాక సమఉజ్జీలుగా గౌరవించే భరత్ పద్ధతి నాకు నచ్చింది. ఆంధ్రా యూనివర్సిటీలో ప్రొఫెసర్ శాస్త్రిగారినుంచి, అదే తరహా వ్యక్తితో కలిసి పని చెయ్యడం నా అదృష్టమనిపించింది. ఆపైన భరత్ జ్ఞానపరిజ్ఞానాల ఆసరాతో– భవిష్యత్తులో నా ఎదుగుదల తథ్యమనిపించింది.

యూనివర్సిటీలో ఉన్నప్పుడు అక్కడ ప్రొఫెసర్ల మధ్య ఉండే అహాలూ, రాజకీయాలూ స్వానుభవమే. ఐతే నా పనేదో నాది కాబట్టి, వాటికి దూరంగానే ఉండగలిగాను. యూనివర్సిటీ వదిలినప్పుడు అందరు ప్రొఫెసర్లతోనూ సుహృద్భావాన్ని నిలుపుకోగలిగాను. ఎదుటివారి నుంచి ప్రయోజనం ఆశించనప్పుడు రాజకీయాలకు దూరంగా ఉండడం కష్టం కాదు.

అదే సిద్ధాంతాన్ని లేబరేటరీలోనూ పాటిస్తున్నాను. సీతారాం– భరత్‌లమధ్య వివాదం జరుగుతున్నప్పుడు నేను ఏ వర్గంలోనూ లేను. ప్రఫుల్ల చేరేక నేను భరత్‌ను వదిలి వెళ్లిపోనూ లేదు. ఎటొచ్చీ వివాదాల్లో లేను. నా పనేదో నాది. ప్రాణం సుఖంగా ఉంది.

ఐతే అదంత తేలిగ్గా పోయే వ్యవహారం కాదు.

భరత్ దగ్గర నేనే కాదు. రాజకీయాలతో నిమిత్తం లేకుండా తమ మానాన తాము పని చేసుకూంటూ పోయేవాళ్లు మరో పదిమంది ఉన్నారు. విశేషమేమంటే మేము మెరికల్లాంటివాళ్లమనీ, భరత్‌కి మేమే బలమనీ లేబరేటరీలో ప్రచారముంది. ప్రఫుల్ల అది నమ్మాడు. ఆయన మమ్మల్ని భరత్ నుంచి వేరు చెయ్యడానికి కొంతమంది అనుచరుల్ని మావద్దకు పంపుతుండేవాడు. మేము వాళ్లు చెప్పింది వినేసి, 'ప్రస్తుతానికే సమస్యలూ లేవు. సమస్య వస్తే మమ్మల్ని ఆదుకుందుకు ప్రఫుల్ల ఉన్నాడని ధైర్యముంది' అని చెప్పి పంపేసేవాళ్లం.

వాళ్లొచ్చి వెళ్లిన విషయం తెలిసి భరత్ మానుంచి వివరాలు ఆరాలు తీసేవాడు. జరిగింది జరిగినట్లుగా చెబితే విని కాస్త ఆవేశపడేవాడు. ఈ విషయమై ప్రఫుల్లని నిలదీస్తాననేవాడు. 'సాక్ష్యాలకోసం మమ్మల్ని ఈ రొంపిలోకి లాగొద్దు' అని మేమంటే మళ్లీ తగ్గేవాడు.

సైంటిఫిక్ రీసెర్చి రంగం వేరు. అక్కడ రాజకీయాలున్నా వాటివల్ల ప్రయోగాలూ, ఫలితాలూ మారిపోవు. సైంటిస్టు మనసెప్పుడూ జ్ఞానాన్వేషణలోనే ఉంటుంది కాబట్టి, ఆ పని ఆగిపోదు. ఈ రాజకీయాలు అర్థరహితమైన చిన్న డిస్టర్బెన్స్– అంతే!

డాడ్ స్కాలర్‌షిప్పుకి భరత్ కొలీగ్సు పేర్లు ప్రతిపాదించడం ప్రఫుల్లకి ఇష్టం లేదు. లేకుంటే ఆయన చేరిన సంవత్సరమే నా పేరు పంపాలి. ఆయన మమ్మల్ని అపడానికి కొత్త కొత్త షరతులు పెట్టి రెండేళ్లు పక్కన పెట్టాడు. చివరికి ఆ షరతులు కూడా పూర్తి చెయ్యడంతో ఆ సంవత్సరం ప్రతిపాదించిన నాలుగు పేర్లూ భరత్ డివిజనువే అయ్యాయి. అదాయన జీర్ణించుకోలేకపోయాడనడానికి సూచనగా–

లేబరేటరీ అభ్యర్థులందరికీ డైరెక్టర్ స్పెషల్ రికమెండేషన్ విధిగా ఉండలంటే– 'నా రికమెండేషన్ అందరికీ ఇవ్వలేను. ఎందుకంటే ఒకేసంస్థనుంచి నలుగురికి ఎలాగూ వాళ్లివ్వరు. పోనీ అని ఒకర్నే రికమెండ్ చేస్తే, పక్షపాతం ఔతుంది"– అని అప్పటికి దాటేశాడు.

ఆశ్చర్యమేమంటే– ఆయన రికమండేషన్ లేకపోయినా ఆ నలుగురిలో– నేను, భూషణ్ ఇంటర్వ్యూలో ఎంపికయ్యాం. అది కూడా ఆయన జీర్ణించుకున్నాడని అనుకోను.

భూషణ్‌కి జర్మనీలో ఉండాలని లేదు. గడువు కాలం ముగిసీ ముగియగానే ఇండియా వెళ్లిపోవడానికి నిశ్చయించుకున్నాడు. నేను మాత్రం నా స్టే ఎక్స్‌టెండ్ చెయ్యాలని అనుకుంటున్నాను. అందుకు డాడ్ అనుమతించింది. ప్రఫుల్ల ఒప్పుకుంటాడా?

శ్రీమతి చెప్పేదాకా ఈ విషయమే నేను ఆలోచించలేదు.

ఏంచెయ్యాలా అని ఆ రాత్రంతా మనసులో తర్జనభర్జన పడ్డాక, ఈ విషయమై రాలెక్‌నే ఆశ్రయించాలనుకున్నాను.

ఐతే ఇది చాలా సున్నితమైన వ్యవహారం.

మా లేబరేటరీ రాజకీయాల గురించి రాలెక్‌కు తెలియడం ఇష్టం లేదు.

అసలే ఇండియన్ అడ్మినిస్ట్రేషన్ గురించి ఆయనకు సదభిప్రాయం లేదు. సైంటిఫిక్ రీసెర్చిలోనూ అలాగే ఉందని తెలిస్తే– ముందు తన జర్మన్ కొలీగ్సులో ఆ విషయం ప్రచారం చేస్తాడు. మా లేబరీటరీని వాళ్లు పొరపాటుగా అర్థం చేసుకుంటారు.

అందుకని బాగా ఆలోచించాక– మర్నాడు రాలెక్‌ని కలుసుకున్నాను.

"ఇండియన్సే కాదు, ఏ దేశం వాళ్లైనా జర్మనీలాంటి దేశానికొస్తే– వీలైనంత ఎక్కువ కాలం ఉండాలనుకుంటారు. ఆకర్షణలోనే కాదు, సైంటిఫిక్ రీసెర్చికీ ఇదో ప్రత్యేకమైన దేశం. నేను ఇక్కడికొచ్చేముందు– ఏడాదిలో ఏంచేస్తాంలే, ఏదో గడిపేసి వెళ్లిపోదాం అనుకున్నాను. ఇక్కడికొచ్చేక తెలిసింది. ఏడాదిలో ఎంతైనా చెయ్యొచ్చు అనిపించే వ్యవస్థ

ఇక్కడున్నదని! వచ్చిన అవకాశాన్ని సదుపయోగం చేసుకుందుకు– నువ్వూ, ఈ సంస్థ యాజమాన్యం ఎంతో సహకరించారు. మరో ఆర్నెల్లుంటే నా స్టే సార్థకమౌతుంది. అందుకు డాడ్ కూడా అనుమతించింది. ఐతే మా సంస్థ డైరెక్టర్ అలా అనుకోకపోవచ్చు. నేనీ దేశపు ఆకర్షణలో పడి ఏదో వంకన స్టే ఎక్స్‌టెండ్ చేస్తున్నానని అనుకోవచ్చు. అది నా కిష్టముండదు. నా ఎక్స్‌టెన్షన్ విషయం నువ్వే మా సంస్థ డైరెక్టరుకి ఉత్తరం రాస్తే బాగుంటుందని చెప్పడానికి వచ్చాను" అని ఆయనకి చెప్పాను.

నేను చెప్పింది విని రాలెక్ కొంచెం బిగ్గరగానే నవ్వాడు. ఆపుకుందుకు కొంచెంసేపు పట్టింది.

ఎందుకు నవ్వాడు? ఇండియన్ మెంటాలిటీని వేళాకోళం చేస్తాడా?

రాలెక్ తేరుకున్నాక, "నిన్ను స్టే ఎక్స్‌టెండ్ చెయ్యమని అడిగింది నేను. ఏడాది ఉండమంటే ఆర్నెల్లే ఉంటానన్నది నువ్వు. డాడ్‌కి ప్రపోజల్ నువ్వే పంపడం పద్ధతి కాబట్టి కానీ, అదీ నేనే పంపి ఉండేవాణ్ణి. నువ్వు మా అతిథివి. నిన్నిక్కడికి పంపింది మీ సంస్థ. అందుకు మీ డైరెక్టరుకి థాంక్సు చెబుతూ– ఆర్నెల్ల ఎక్స్‌టెంషన్ గురించి తెలియబర్చి, అనుమతించమని కోరడం నా బాధ్యత. నా బాధ్యతను నిర్వహించమని నువ్వు నన్ను రిక్వెస్ట్ చెయ్యడమేమిటి? ఇండియన్ కర్టెసీ గురించి విన్నాను కానీ స్వానుభవం చేశావు నువ్వు" అన్నాడు.

తెల్లబోయి చూస్తే ఆయన కళ్లలో గౌరవంతో కూడిన వాత్సల్యం కనిపించింది. ఇండియాలో ఐతే అప్రయత్నంగా నమస్కరించేవాణ్ణి. ఇక్కడ నమస్కరించకుండా ఉండడానికి ప్రయత్నించాను.

ఏదైనా అందామంటే నోట మాట రాలేదు.

అంతలోనే ఆయన తన బల్లమీద ఫైల్లోంచి ఓ కాగితం తీసి పట్టుకుని, "ఉత్తరం నిన్ననే రెడీ చేశాను. ఈ రోజు పంపుతున్నాను. కావడానికి కాన్ఫిడెన్షియలే కానీ, ఓ కాపీ నీకివ్వడానికి నాకు అభ్యంతరమూ లేదు" అంటూ అది నాకిచ్చాడు.

బయటికొచ్చేక ఆ ఉత్తరం చదివాను. ఇండియన్ లేబరీటరీకి కదా– ఇంగ్లీషులోనే వ్రాశాడు.

రాలెక్ ఇంగ్లీషు ప్రొఫెషనల్ స్టైల్లో ఉంది. ఇంగ్లీషుకంటే విశేషం — ఆయన అందులో నన్ను ఆకాశానికెత్తేయడం.

అది కాన్ఫిడెన్షియల్ లెటర్ కాకపోతే, నేను దాన్ని టెస్టిమోనియల్ గా జీవితాంతం ఉపయోగించుకోవచ్చు.

పాశ్చాత్యులు మనసులోని మాటనే నిర్ద్వంద్వంగా చెబుతారని నమ్ముతాను కాబట్టి– ఇన్నాళ్లూ తనకి నాపై ఉన్న అభిప్రాయమేమిటో అప్పుడు తెలిసి ఎంతో సంతోషంగా అనిపించింది.

ఐతే ఎక్స్‌టెన్షన్ ప్రహసనం అంతటితో ముగియలేదు.

ఆ తర్వాత సుమారు రెండు వారాలకు కాబోలు, ఒక రోజు రాలెక్ నా వర్క్‌ప్లేసుకి వచ్చాడు.

చేతిలో ఏదో కాగితముంది. మొహం కందగడ్డలా ఎర్రగా ఉంది.

''డాక్టర్ రావ్, ఎవరీ ప్రఫుల్ల?'' అన్నాడాయన. మొహంలో కనిపించిన ఎరుపు గొంతులో కూడా ధ్వనిస్తోంది....

*(కొనసాగింపు వచ్చేనెలలో)*

Post your comments